ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రూ.2 కోట్లతో శ్రీలక్ష్మీ కంబగిరి స్వామి ఆలయ పునర్నిర్మాణం
- అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

అవుకు: పురాతన ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రూ. కోట్లు వెచ్చించి పునర్నిర్మాణాలు చేపడుతున్నామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గుర్తు చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరి స్వామి ఆలయ నిర్మాణ పనులను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాలు అభివృద్ధికి నోచుకోక మరుగున పడకూడదని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పించారని, ఈ మేరకు ఆలయాలను అన్నివిధాలుగా తీర్చిద్దుతున్నామని చెప్పారు. ఎర్రమల కొండల్లో వెలసిన అతి పురాతన ఆలయం శ్రీలక్ష్మీ కంబగిరి స్వామి అని, ఈ ఆలయానికి ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారన్నారు. గతేడాది ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. గర్భాలయం, రాతితో నిర్మిస్తున్న అర్థమండపం దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మరో మండపం, విమాన గోపురం పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అదేవిధంగా రాజగోపురం, ప్రాకార మండపం, వసంత మండపం నిర్మాణాలకు రూ.1.95 కోట్లతో నివేదికలు తయారు చేశారని, త్వరలోనే నిధులు విడుదల చేయించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను త్వరితగితిన పర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఈ నాగిరెడ్డి, ఏఈ రవి కుమార్ రెడ్డి, స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి



కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనాలు, షెపర్డ్ ట్రెనింగ్ సెంటర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో రూ. 8 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనం, రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న షెపర్డ్ ట్రెనింగ్ సెంటర్ నిర్మాణ పనులను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతగా ఉండాలని సూచించారు. షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్‌కు వచ్చే రైతులకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు మంత్రి రాచర్ల సమీపంలో చేపడుతున్న లక్ష్మీనరసింహస్వామి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, హుసేనాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

సంజామల: మండల కేంద్రం సంజామల కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న అనాథ పిల్లలకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండేకంటి కిరణయ్య బుధవారం ఆర్థిక సాయం అందించారు. తల్లి,తండ్రి ఒకరు లేకున్నా ఇద్దరూ లేని విద్యార్థుల చదువుల ఖర్చు నిమత్తం 30 మందికి రూ.41 వేలు అందజేశారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్ : ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి ఏఐటీయూసీ ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్వర్, వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో బుధవారం రాస్తో రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

క్లుప్తంగా

రబీ పంటలు ఈ క్రాప్ చేయించుకోవాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి రైతులు ఈ క్రాప్ చేయించుకోవాలని ఏఓ నిరంజన్ సూచించారు.బుధవారం ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి రబీ పంటల నమోదు ప్రక్రియ చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరాలంటే పంటల నమోదు తప్పని సరి అన్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో శ్రీశైలం జలాశయంలో నీరు పూర్తిస్థాయిలో లేదని, ఆరుతడి పంటలు వేసుకోవాలని వివరించారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయం ఏడవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల:మండలంలోనిగుళ్లదూర్తి గ్రామంలో వెలసిన చిన్నమ్మ ఆశ్రమంలో శుక్రవారం నుంచి చిన్నమ్మ 67వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఆరాధనోత్సవాల్లో ప్రతి రోజు దక్షిణామూర్తి పూజలు, శ్రీరామతీర్థ సేవా సత్సంగం ఆధ్వర్యంలో గీతా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.ఆరాధనోత్సవాలకు వైఎస్సార్ జిల్లా అమ్మయ్యగారి మఠం నుంచి సుధీరానంద సరస్వతీ, రాముడు, జయదేవానందగిరిస్వామి ఉపన్యాసకులుగా వ్యవహరిస్తారన్నారు.

సత్ప్రవర్తనకు మూలం విద్య, ఆధ్యాత్మికం

డోన్:మనిషి సత్ప్రవర్తనతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, ఇందుకు విద్య, ఆధ్యాత్మిక చింతన ఎంతగానో ఉపయోగపడుతుందని గీతాయోగాసన సంఘం వ్యవస్థాపకులు రాంపుల్లయ్య అన్నారు. 'మన ఊరు.. మన గుడి..మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా కుంత ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం స్థానిక వేంకటేశ్వర ఆలయాన్ని యోగాసన సంఘం సభ్యులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో యోగాసన సంఘం అధ్యక్షులు బచ్చు సురేష్, కార్యదర్శి మాకం బాలు, సభ్యులు సముద్రాల బాబు, శ్రీరాములు, సంగాల సాయిబాబా, నాగభూషణరెడ్డి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: గ్రామాల్లో ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొలుములపల్లె, ముద్దవరం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు చిన్న మద్దమ్మ, తిమ్మయ్య ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఏఓ కిరణ్ కుమార్ , ఆర్‌డబ్ల్యూస్ ఇంజనీర్ రాజశేఖర్, ఏపీఓ శేషన్న, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం షేక్ ముస్లింల కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్ కార్యాలయం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. కరణంమొహిద్దీన్ కాలనీ, మంగళవారంపేట ఎస్సీ కాలనీ, పెద్దపీర్ల చావిడి మర్కస్ మసీద్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

క్రీడా సంబరాలకు ఏర్పాట్లు పూర్తి

కొలిమిగుండ్ల: క్రీడా కారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతు 15నుంచి మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్,కబడ్డీ, ఖోఖో, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా సచివాలయాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అవుకు: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అవుకు మండల నాయకులు రామ గోవిందు, ఈశ్వరయ్య, బాలరాజు, సుంకన్న, దస్తగిరి, కృష్ణ, రవిప్రకాశ్, కంబయ్య, రమణ, బాలదాస్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తునామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. 13వ సచివాలయం పరిధిలో 18, 22,23 వార్డుల్లో బుధవారం కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, శరత్, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ,పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నా రు.మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో డోన్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, సచివాల య కన్వీనర్లు శ్రీను, దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడలు

డోన్ టౌన్ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఈ నెల 15వ తేదీ నుంచి వివిధ ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆటల పోటీలకు సంబంధించి క్రీడా సామగ్రిని వార్డు సచివాలయ ఇన్‌చార్జ్‌లకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రికెట్, షటిల్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ పోటీలను జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలలోనిర్వహిస్తున్నామన్నారు. షటిల్‌ను బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్, సచివాలయాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం





సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి , సంక్షేమం, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్యాపిలి: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యం అని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముడియాల మహేంద్రమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట కోట్లాది రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ వ్యవస్థల ద్వారా నేరుగా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏనుగుమర్రి సర్పంచ్ మదన్‌మోహన్, హుసేనాపురం సింగిల్‌విండో అధ్యక్షులు బాలయ్య, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకళాధర్ రెడ్డి, తెలుగు విష్ణు, యాగంటి, తెలుగు నాగరాజు, రామచంద్రుడు, శ్రీనివాసులు, మురియలయ్య, రమణయ్య, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మహేశ్, లోకేశ్వర రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుకులో 'పల్లెకు పోదాం'

అవుకు: మండల కేంద్రం అవుకు -2 గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం మండల అధికారులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సచివాలయ పరిధిలో ప్రజలు పొందిన లబ్ధి వివరాలు, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ప్రజలకు వర్తించిన లబ్ధి వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామకృష్ణవేణి, ఈఓ అశ్విన్ కుమార్, ఏపీఓ అనీఫా, ఏపీఎం విజయగోపాల్, సర్పంచ్ మందా గుర్రమ్మ, పంచాయతీ కార్యదర్శి హరిప్రతాప్ రెడ్డి, ఏఎస్‌ఎం వెంకటేశ్వరమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ఓవర్ ట్యాంక్ నిర్మాణం కోసం పిల్లర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.40 లక్షలతో గీతాశ్రమం సమీపంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రెండున్నర నెలల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్ల కంటే అంకిరెడ్డిపల్లె జనాభా, ఓటర్ల పరంగా పెద్ద గ్రామం. 2019 కంటే ముందు గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొని ఉండేది. ట్యాంకర్లతో నెలల తరబడి ప్రజలకు నీటి సరఫరా చేసినా చాలీచాలక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. తుమ్మలపెంట క్రాస్ రోడ్డు సమీపంలో రెండు బోర్లు వేయడంతో పుష్కలంగా నీళ్లు పడ్డాయి. గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కాటసాని రూ.30 లక్షలు మంజూరు చేయించడంతో 2.కి.మీ మేర పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా అందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో జనాభాకు తగ్గట్లుగా ఒక్కటే ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్న కారణంగా అన్ని వీధులకు నీటి సరఫరా చేయడంలో జాప్యం చోటు చేసుకుంటుంది. భవిష్యత్‌లో మంచినీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడకూడదనే ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరు చేయించడంతో యుద్ధప్రాతిపదికన ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు జరుగుతున్నాయి.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపాన ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బీజేపీకి ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ప్రజలు కల్పిస్తే అవినీతిలేని పాలన అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ యాదవ్, దస్తగిరి,బచ్చుశరత్‌చంద్ర, జావేద తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

డోన్ టౌన్ : ఐకమత్యంగా బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధక్షురాలు బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో బీజేపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

నేడు 4,5 వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణంలోని 4,5 వార్డులోని సబ్ రిజిష్టర్ కాలనీ, సరస్వతీ శిశుమందిర్, షాదీఖాన ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, విద్యుత్ లైన్ల పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూదన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం గంటల వరకు కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయంతం చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక మండల కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఈనెల 15వతేదీన ప్రారంభం కానున్నాయని, కలసి కట్టుగా ఉండి కార్యక్రమాన్ని ముందుకు నడపాలని సూచించారు. 15 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు కూడ ఈ క్రీడలలో పాల్గొవచ్చని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌కుమార్, ఏఓ అబ్దుల్‌షఫీ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు తగదు



మున్సిపల్ వైస్ చైర్మన్, కొత్రికె హరికిషన్

డోన్ టౌన్ : తనకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీపై తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోత్రికె హరికిషన్ ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పనికట్టుకొని ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను చేస్తోందని మండిపడ్డారు. తన రాజకీయ ఉన్నతికి కారణమైన వైఎస్సార్‌సీపీతో పాటు మంత్రి బుగ్గనపై తనకు ఏలాంటి అసంతృప్తి లేదన్నారు. ఒకటి, రెండు పార్టీ కార్యక్రమాలకు సొంత పనుల మూలంగా హాజరు కాకపోవడాన్ని అలుసుగా తీసుకోని అభూత కల్పనలు, అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. తన ప్రమేయం లేకుండ ఈలాంటి తప్పుడు కథనాలను ప్రచురించే పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, డీటీ సత్యదీప్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ఈనెల 22వ తేదీన ఎన్నికల సంఘం ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తారన్నారు. 9వ తేదీన అందిన ఓటరు దరఖాస్తులతో పాటు ఇతర క్లైమ్‌లను 16వ తేదీలోపు పూర్తి చేయాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన వడ్డె రాజశేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బుధవారం నమోదైనట్లు ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు మండలం చెర్లోపల్లె గ్రామంలో వడ్డె రాజశేఖర్ ఇంటికి కరెంట్ బిల్లు తీయడానికి వెళ్లిన ఎలక్ట్రిషియన్ బరాబరి పరదేశి అనే వ్యక్తిని కులం పేరుతో దూషించడంతోపాటు చెప్పుతో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన రేషన్ డీలర్ పాలకొల్లు శేఖర్ (49) ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా మంగళవారం రాత్రి ట్రాక్టర్ ఢీ కొన్న సంఘటనలో తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడిని కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ బుధవారం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పాలకొల్లు శేఖర్ మృతి పట్ల మండల డీలర్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

డోన్ రూరల్ : గొర్రెలు, మేకల పెంపకందారులను కేంద్రా, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తి కోరారు. పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రథమ సదస్సు కన్వీనర్ కోట్ల పోతులయ్య, ఆదినారాయణ, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅథితగా హాజరైన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన బోర్డు

ఆకట్టుకుంటున్న బోర్డు

బేతంచెర్ల: పట్టణంలోని కర్నూలు రహదారిలోని అయ్యాల చెర్వు నుంచి పట్టణం మీదుగా కస్తూర్బా విద్యాలయం వరకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.19.20 కోట్లతో నాలుగు లైన్ల రహదారి వేశారు. గతనెల మంత్రి బుగ్గన రహదారిని ప్రారంభించిన విషయం తెలిసిందే. నూతన రహదారిపై పట్టణంలోకి వచ్చే క్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లే పట్టణాలు, గ్రామాల వివరాలు తెలిపేలా ఏర్పాటు చేసిన బోర్డు ఆకట్టుకుంటుంది. రోడ్డుకుప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామం వద్ద బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఎద్దుపెంట గ్రామంలో జరుగుతున్న దేవరకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అనిల్, నాగన్న, నరేష్‌కు గాయాలయ్యాయి. వీరిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

డోన్ టౌన్: పేదల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ప్రవేశ పెట్టిందని బీజేపీ జిల్లా నాయకులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక వైష్ణవి హాస్పిటల్‌లో లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా నంద్యాల జిల్లా రీజినల్ కార్యదర్శి శివరామ్‌లు కోరారు.